క్లుప్తంగా

నేల బెలుం ఆలయానికి విరాళం

కొలిమిగుండ్ల: బందారపల్లె సమీపంలోని పురాతన నేల బెలుం మల్లేశ్వరస్వామి ఆలయానికి సోమవారం మదనంతపురానికి చెందిన అంబటి రాజశేఖరరెడ్డి, రత్నమ్మ దంపతులు రూ.50వేలను ఆలయ కమిటీ చైర్మన్ బాలవెంకటరెడ్డికి అందజేశారు. అంతకు ముందు స్వామివారికి దాత కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల సౌకర్యం కోసం ఆలయ ఆవరణలో రేకుల షెడ్డు, డైనింగ్ హాల్ నిర్మాణం చేపడుతున్నామని కమిటీ చైర్మన్ తెలిపారు. దాతల సహకారంతో ఈ కార్యక్రమాన్ని పూర్తి చేస్తామని తెలిపారు. ఆలయంలో సౌకర్యాలు మెరుగుపర్చేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.

నీటి పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి

కోవెలకుంట్ల: వివిధ నీటి వనరుల ద్వారా సాగునీటిని మళ్లించుకుంటున్న రైతుల నుంచి నీటి పన్ను వసూళ్లపై దృష్టి సారించాలని తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి వీఆర్‌ఓలకు సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని వీఆర్‌ఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని ఎస్సార్బీసీ, కేసీ కెనాల్, కుందూనది, పాలేరు, కుందరవాగు పరివాహక ప్రాంతాల్లో ఎకరాకు రూ.200 చొప్పున నీటి పన్ను వసూలు చేయాలన్నారు. నీటి పన్ను వసూళ్ల లక్ష్యాన్ని అధిగమించడంతోపాటు గతంలో పెండింగ్‌లో ఉన్న పన్నుల వసూళ్లలో చొరవ చూపాలని పేర్కొన్నారు. ఆర్‌ఐ లక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ పుల్లయ్య, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి సన్మానం



హెచ్‌ఎంను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కొలిమిగుండ్ల: అంకిరెడ్డిపల్లె మెయిన్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై కొలిమిగుండ్ల ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా వెళ్లిన జయరామిరెడ్డిని సోమవారం పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఆయన సేవలను కొనియాడారు. పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న పేద విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు ఇతర వస్తువులు ఇచ్చేందుకు హెచ్‌ఎం జయరామిరెడ్డి రూ.5వేలు ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఆదిశేషయ్య, ఉపాధ్యాయులు శ్రీలత, శశికళ, అహల్యాదేవి, రాజశేఖరరెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బనగానపల్లెలో భారీ వర్షం

బనగానపల్లె: మండల కేంద్రంతో పాటు పరిసర ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సాగులో ఉన్న మొక్కజొన్న, వరి తదితర పంటలు ఎండిపోతున్న తరుణంలో వర్షం ఊరటనిచ్చిందని రైతులు హర్షం వ్యక్తం చేశారు.

ఆలయాభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

బనగానపల్లె రూరల్: మండలంలోని నందవరం చౌడేశ్వరిదేవి ఆలయ అభివృద్ధికి ధర్మవరం పట్టణానికి చెందిన కుంకా సురేష్ బాబు, సునీత కుటుంబ సభ్యులు రూ.25వేల విరాళాన్ని అందజేసినట్లు ఆలయాభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీకుమార్‌రెడ్డి సోమవారం తెలిపారు. దాతలకు అమ్మవారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు, పూలమాలతో సత్కరించారు.

కుటుంబానికి చేయూత



నిత్యావసర సరుకులు అందజేస్తున్న జ్ఞాన నిధి సేవా సంస్థ ప్రతినిధులు

బేతంచెర్ల: పట్టణంలోని దుర్గాపేట కాలనీకి చెందిన నడ్డి వెంకటస్వామి, నాగమ్మ దంపతుల కుమారుడు వెంకటేశ్వర్లు ఇటీవల మృతి చెందాడు. ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో జ్ఞాననిధి సేవా సంస్థ సభ్యులను సంప్రదించారు. వారు స్పందించి రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు, నగదు అందజేసి అండగా నిలిచారు. సేవా సంస్థ సభ్యులు తిమ్మయ్య, ఆనంద్, శివ కృష్ణ, మధు ఈశ్వర్, అఖిల్, మధు, ఎల్లయ్య పాల్గొన్నారు.

వ్యాధుల కాలం.. జరభద్రం

- దోమల విజృంభణతో డెంగీ, మలేరియా సోకే ప్రమాదం
- పరిసరాల, వ్యక్తిగత శుభ్రతే ప్రధానమని వైద్యుల సూచన



అవుకు ముస్లిం వీధిలో నిల్వ చేరిన మురుగు



చాకలి వీధిలోని రైతు సేవా కేంద్రం పక్కన పేరుకుపోయిన చెత్త

అవుకు: వర్షాకాలం వచ్చిందంటే వ్యాధులు సోకే ప్రమాదం పొంచి ఉంటుంది. మురుగు నీరు నిలిచిపోవడం, పారిశుద్ధ్యం మెరుగ్గా లేని ప్రాంతాల్లో దోమలు, సూక్ష్మ క్రిములు వృద్ధి చెంది వ్యాధులకు కారకాలుగా మారుతాయి. దీంతో జ్వరం, ఇతర అనారోగ్య సమస్యల బారిన పడే ప్రమాదముంది. ప్రస్తుతం అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. అవుకులోని పలు ప్రాంతాల్లో మురుగునీరు నిల్వ చేరి అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. చెత్త పేరుకుపోయి దోమలకు ఆవాసంగా మారాయి. ఇలాంటి తరుణంలో ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించడంతోపాటు జ్వరం, ఇతర అనారోగ్య సమస్యలు వస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే డాక్టర్లను సంప్రదించాలని వైద్యులు సూచిస్తున్నారు.

సాధారణ జ్వరం, జలుబు

సీజన్ మార్పుతో పెరిగే సూక్ష్మక్రిముల వల్ల వైరల్ జ్వరాలు వ్యాప్తి చెందుతాయి. గాలి, నీటి ద్వారా మానవ శరీరంలోకి సూక్ష్మజీవులు ప్రవేశిస్తాయి. వైరస్ రకాన్ని బట్టి జ్వరం ఉంటుంది. జ్వరం మాత్రమే కాకుండా కొందరికి దగ్గు, కీళ్ల నొప్పులు ఉంటాయి. వైరల్ జ్వరం 3 నుంచి 7 రోజుల వరకు ఉంటుంది.

చికెన్ గున్యా

తీవ్రమైన జ్వరం, కీళ్ల నొప్పులు చికెన్ గున్యా లక్షణాలు. ఈ జ్వరం దోమ కాటు వల్ల వస్తుంది. చికెన్ గున్యా సోకితే మొదటి రెండు, మూడు రోజులు జ్వరం ఎక్కువగా ఉంటుంది.

మలేరియా

తీవ్రమైన తలనొప్పి, వణుకుతో కూడిన అధిక జ్వరం మలేరియా లక్షణం. జ్వరం తగ్గి మళ్లీ వస్తుంది. మలేరియా ఆడ అనాఫిలిస్ దోమ కాటుతో వ్యాప్తి చెందుతుంది. దోమకాటు వల్ల దాని లోపల ఉన్న మలేరియా జెరమ్స్ శరీరం లోపలికి వెళ్తాయి. 14 రోజుల తర్వాత అధిక జ్వరం వస్తుంది. ఈ దోమలు నిల్వ ఉన్న వర్షపు నీటిలో వృద్ధి చెందుతాయి.

డెంగీ

ఈడిస్ ఈజిప్ట్ అనే దోమ కాటుతో డెంగీ వ్యాప్తి చెందుతుంది. ఈ దోమ పగటిపూట కుడుతుంది. దోమ కుట్టినప్పుడు ఒళ్లంతా దద్దుర్లు కనిపిస్తాయి. వైరల్ జ్వరం మాదిరి అకస్మాత్తుగా జ్వరం వస్తుంది. తలనొప్పి, ఒళ్లునొప్పులు, కీళ్ల నొప్పులతో ఎముకలు విరిగేటంత నొప్పి కలిగిస్తుంది. ఒక్కోసారి శరీరం లోపలి భాగాల్లో రక్తస్రావం జరుగుతుంది. దాని వల్ల కాళ్లు, చేతులు, ముఖం, వీపు భాగాల చర్మంపై ఎర్రగా కందినట్లుగా చిన్నచిన్నమొటిమలు కనిపిస్తాయి. ఒక్కోసారి ప్లేట్‌లెట్స్ తగ్గిపోయి పరిస్థితి విషమంగా మారుతుంది.

హెపటైటిస్ ఏ

వర్షాకాలంలో హెపటైటిస్ ఏ (కామెర్లు) వ్యాధి ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది. ఇది కాలేయ కణాల్లో సంక్రమణ వల్ల కలుగుతుంది. ఈ వ్యాధి సూక్ష్మక్రిములు కలుషితమైన ఆహార పదార్థాల నుంచి, తాగునీటి నుంచి శరీరంలోకి ప్రవేశిస్తాయి. కాలేయ వ్యాధి కారణంగా రక్తంలో బిలిరుబిన్ పరిమాణం పెరుగుతుంది. శరీరభాగాలు పసుపు రంగులో కనిపిస్తాయి.

టైఫాయిడ్

వర్షాకాలంలో టైఫాయిడ్ కేసులు పెరిగే అవకాశం ఉంది. ఇది సాల్మొనెల్లా టైఫి బ్యాక్టీరియా వల్ల వస్తుంది. మురుగునీరు తాగడం, కలుషితమైన ఆహారం తినడం వల్ల ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది.

దోమల నివారణకు చర్యలు శూన్యం

పల్లెల్లో దోమల నివారణ చర్యలు చేపట్టకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు. మండల కేంద్రం అవుకుతో పాటు మండల పరిధిలోని గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా మారిందని.. దోమల నివారణకు ఫాగింగ్ చేయడం లేదని, అడపాదడపా బ్లీచింగ్ పౌడర్ చల్లి వదిలేస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉంటుంది. వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలి. తాజా ఆహార పదార్థాలు తీసుకోవడం ఉత్తమం. కలుషిత ఆహారం, కలుషిత నీటికి దూరంగా ఉంటే వ్యాధులు సోకకుండా రక్షణ పొందవచ్చు. జ్వరం, ఇతర అనారోగ్య సమస్యలు వస్తే వెంటనే వైద్యులను ఆశ్రయించాలి. ప్రభుత్వ ఆస్పత్రిలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి.

–డాక్టర్ అభినయ్, అవుకు సీహెచ్‌సీ సూపరింటెండెంట్

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి.
- పెంటకుప్పలు, చెత్తాచెదారం ఇంటికి దూరంగా వేయాలి.
- ఇంటి పరిసరాల్లో కొబ్బరిబోండాలు, పాత టైర్లు, ఖాళీ డబ్బాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలి.
- దోమ తెరలు వాడటం శ్రేయస్కరం. వారంలో ఒకరోజు డ్రైడే పాటించాలి.
- నీళ్ల ట్యాంకులపై సరైన మూతలను అమర్చాలి.
- భోజనం చేసేముందు తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకోవాలి.
- కాచి చల్లార్చిన నీటిని తాగాలి. నిల్వ ఉన్న పదార్థాలు, బయట ఆహారం తినకూడదు.
- తాజా పండ్లు, పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు తీసుకోవాలి.
- వ్యక్తిగత మరుగుదొడ్లు వినియోగించాలి.

నేడు మంచినీటి సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్: వెంకటాపురం రోడ్డులోని పేరంటాలమ్మ గుడి వద్ద ఉన్న వాటర్ ఫిల్టర్ హౌస్‌లో నిర్వాహణ పనుల నిమిత్తం మంగళవారం మోటర్లు నిలిపి వేస్తున్న కారణంగా పట్టణానికి మంచినీటిని సరఫరా చేయడంలో అంతరాయం ఏర్పడుతుందని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం నుంచి యథావిధిగా నీటి సరఫరా కొనసాగుతుందని.. ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి నివాళి

డోన్ టౌన్: భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా సోమవారం మండలంలోని చింతలపేట, చిన్నమల్కాపురం గ్రామాల్లో ఆయన చిత్రపటానికి బీజేపీ నాయకులు నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామకృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు బొంకూరి రవికుమార్ పాల్గొన్నారు.

ఉపాధి ఉద్యోగులపై విచారణ

కొలిమిగుండ్ల: ఉపాధి ఉద్యోగుల విందుకు సంబంధించి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ప్రసాదరెడ్డి, ఏపీడీ సాంబశివరావు విచారణ చేపట్టారు. కల్వటాలలో ఫీల్డ్ అసిస్టెంట్ ఇటీవల విందు ఏర్పాటు చేయడంతో ఉపాధి ఉద్యోగులు హాజరై మద్యం సేవించి, విందు భోజనం ఆరగించారు. దీనికి సంబంధించి వీడియో వైరల్ అయింది. పత్రికల్లో కథనాలు ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. ఉద్యోగులతో పాటు కల్వటాల, బెలుం, సింగవరం గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్స్‌కు నోటీసుల జారీ చేసి వివరణ ఇవ్వాలని కోరారు. దీనిపై కార్యాలయంలో ఉద్యోగులను విచారించి పూర్తి స్థాయి సమాచారం సేకరించారు. ఫీల్డ్ అసిస్టెంట్ భోజనానికి రమ్మని పిలవడంతో వెళ్లినట్లు ఉద్యోగులు వివరణ ఇచ్చారు. వీడియోలో మద్యం అక్రమాలపై చర్చించడంతో సంచలనంగా మారింది. నివేదికను పీడీకి అందజేస్తాని ఏపీడీ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు ఉంటాయని పేర్కొన్నారు.

పొగాకును ప్రభుత్వమే కొనుగోలు చేయాలి



పొగా రైతులకు ధర్నా కరపత్రాలను అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

బనగానపల్లె: పొగాకును ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని కైప, అప్పలాపురం, టంగుటూరు గ్రామాల్లోని పొగాకు రైతులను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. పొగాకు వేసిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, నాణ్యత పేరుతో కంపెనీలు రైతులకు అన్యాయం చేస్తోందన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద పొగాకు రైతులతో కలిసి ధర్నా చేస్తున్నామని.. అందరూ తరలిరావాలని కోరారు. పొగాకు రైతులు నజీర్‌బాషా, మద్దిలేటి, కిట్టు, మత్తయ్య, ముక్కమళ్ల రామ సుబ్బారెడ్డి, సుబ్బారెడ్డి, సత్యరాజు పాల్గొన్నారు.

సచివాలయ సర్వేయర్ల పెన్‌డౌన్

కొలిమిగుండ్ల: గ్రామ సచివాలయాల పరిధిలో సర్వేయర్లుగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం పెన్‌డౌన్ చేపడుతున్నట్లు ప్రకటించారు. సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి ఎంపీడీఓ ప్రసాదరెడ్డికి వినతిపత్రం అందజేశారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు విధులకు హాజరవుతూనే ఎలాంటి పనులు చేయకుండా శాంతియుత వాతావరణంలో నిరసన వ్యక్తం చేస్తామన్నారు. జనాభా ప్రాతిపదికన కాకుండా రెవెన్యూ విలేజ్ విస్తీర్ణం ఆధారంగా హేతుబద్ధీకరణ చేయాలని కోరారు. పదోన్నతులు కల్పించి బదిలీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. జీఓ నంబర్ 5ను రద్దు చేసి గ్రామస్థాయి ఉద్యోగులకు సొంత మండలాల్లోనే బదిలీలు చేపట్టాలని కోరారు.

సంజామల: గ్రామ సర్వేయర్లు తహసీల్దార్ అనిల్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. గ్రామ సర్వేయర్లు రంగయ్య, నాగేంద్ర, శర్వాని, శ్రవంతి పాల్గొన్నారు.



కొలిమిగుండ్ల: ఎంపీడీఓకు వినతి పత్రం అందిస్తున్న సర్వేయర్లు

కోవెలకుంట్ల: పదోన్నతులు కల్పించిన తర్వాతే బదిలీల ప్రక్రియ చేపట్టాలని గ్రామ సర్వేయర్లు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. జీఓ నంబర్ 5ను సవరించి సొంత మండలాల్లో పనిచేసే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.


బనగానపల్లెరూరల్: మండలంలో గ్రామ సర్వేయర్లు విధులు బహిష్కరించి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ నారాయణరెడ్డికి అందజేశారు. భాస్కర్, హుస్సేన్ బాషా పాల్గొన్నారు.

అందుబాటులో బ్లూటంగ్ వ్యాక్సిన్

అవుకు: మండలంలోని పశువైద్యశాలల్లో బ్లూటంగ్ వ్యాక్సిన్ అందుబాటులో ఉందని.. జీవాల పెంపకందారులు సద్వినియోగం చేసు కోవాలని అవుకు పశువైద్యాధికారిణి భారతీదేవి అన్నారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో జీవాల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా నష్టపోవాల్సి వస్తుందన్నారు. వర్షాకాలంలో క్యూలికాయిడ్స్ అనే దోమ కాటు వల్ల ఆర్బి వైరస్ క్రిముల ద్వారా జీవాలకు నీలినాలుక (బ్లూటంగ్) వ్యాధి వ్యాపిస్తుందని తెలిపారు. ఈ వైరస్ రక్తంలోకి చేరి రక్త కణాలను నాశనం చేస్తుందన్నారు. ఫలితంగా జీవాలు మృత్యువాత పడే అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. ముందస్తు జాగ్రత్తగా జీవాలకు బ్లూటంగ్ వ్యాక్సిన్ వేయించడం మంచిదన్నారు.

వాహన రికార్డులు తప్పనిసరి

బనగానపల్లె రూరల్: వాహనదారులు తప్పనిసరిగా లైసెన్స్, వాహన రికార్డులు కలిగి ఉండాలని బనగానపల్లె సీఐ ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని యాగంటిపల్లె రహదారిలో వాహనాల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను తరలించరాదని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. కుటుంబాలను దృష్టిలో ఉంచుకుని వాహనాలు నడపాలన్నారు. రికార్డులు సక్రమంగా లేని వాహనదారులకు జరిమానా విధించారు.



రికార్డులను పరిశీలిస్తున్న సీఐ

కాంపౌండ్ వాల్ నిర్మించాలని వినతి

డోన్ టౌన్: ఇటీవల కురిసిన వర్షాలకు పట్టణంలోని క్రిస్టియన్ శ్మశాన వాటిక కాంపౌండ్ వాల్ కూలిపోయిందని, తిరిగి నిర్మించాలని పాస్టర్స్ అసోసియేషన్ నాయకులు సోమవారం మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, కమిషనర్ ప్రసాద్ గౌడ్, డీఈ రఘు, ఏఈ సురేష్‌లను కలిసి వినతి పత్రం అందజేశారు. స్పందించిన చైర్మన్, కమిషనర్ కాంపౌండ్ వాల్ నిర్మించేందుకు ఎస్టిమేషన్, డిజైన్ పూర్తయ్యిందని.. త్వరలో పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. వినతి పత్రం అందించిన వారిలో ఆదామ్, మద్దయ్య ఉన్నారు.



మున్సిపల్ చైర్మన్ రాజేష్‌ను కలిసిన పాస్టర్లు

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

ప్యాపిలి: మండల పరిధిలోని హుసేనాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ ఇతర ప్రాంతాలకు బదిలీ అయిన ఉపాధ్యాయులను సోమవారం సన్మానించారు. ఉపాధ్యాయులు అంజనప్ప, పద్మావతి, మద్దిలేటి, శ్రీనివాసులు, శివమ్మ తదితరులను హెచ్‌ఎం అన్వర్ బాషా ఆధ్వర్యంలో సన్మానించారు. హోసా ఆర్గనైజర్, న్యాయవాది నాగభూషణ్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు నరసింహులు, ఉపాధ్యాయులు రుక్సానా, సంధ్యారాణి, నాగేంద్రయ్య పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సన్మానించిన తోటి టీచర్లు

నమ్మించి నట్టేట ముంచడం బాబు నైజం



డోన్ నుంచి నంద్యాలకు తరలివెళ్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



బనగానపల్లెలో కాటసాని రామిరెడ్డి ఇంటి నుంచి బయలుదేరిన నాయకులు

- రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు ధ్వజం
- యువత పోరుకు తరలిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

డోన్: కూటమి ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఇస్తామని నమ్మించి అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగులు, యువతను నట్టేట ముంచిందని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు అన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం నంద్యాల కలెక్టరేట్ ఎదుట చేపట్టిన యువతపోరు కార్యక్రమానికి డోన్ నుంచి పార్టీ శేణులు తరలివెళ్లాయి. ఈ సందర్భంగా శ్రీరాములుతో పాటు పార్టీ వలంటీర్ విభాగం జిల్లా అధ్యక్షుడు పోస్టుప్రసాద్, ఎంపీపీ రేగటి రాజశేఖరరెడ్డి, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్, వైస్ ఎంపీపీ ఎర్రిస్వామి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు తదితరులు ప్రభుత్వ విధానాలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అబద్ధాలు ఆడటం, నమ్మించడం, వంచించడం, మోసగించడం, వెన్నుపోటు పొడవడం లాంటివి నరనరాన జీర్ణించుకున్న వ్యక్తి సీఎం చంద్రబాబు అని విమర్శించారు. నిరుద్యోగులందరికీ రూ.3వేల చొప్పున భృతి చెల్లించే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్‌హుసేన్, నాయకులు ఆర్‌ఈ రాజవర్ధన్, బుగ్గన జయచంద్రారెడ్డి, బొబ్బల శివరామిరెడ్డి, క్వాలిటీ అబ్దుల్లా, ఆర్ట్ రమణ పాల్గొన్నారు.

బనగానపల్లె: పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి స్వగృహం నుంచి భారీ ఎత్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు నంద్యాల తరలి వెళ్లారు. పార్టీ ఎస్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి ఈశ్వర్‌నాయక్, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, మండల కన్వీనర్ జనార్దన్‌రెడ్డి, నాయకులు అంబటిరవికుమార్‌రెడ్డి, రామన్న, ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్ మోహన్‌బాబు పాల్గొన్నారు.

–కోవెలకుంట్ల: కోవెలకుంట్ల నుంచి పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసనాయక్, యువజన, విద్యార్థి విభాగాల మండల అధ్యక్షులు రాంభూపాల్‌రెడ్డి, జశ్వంత్‌రెడ్డి, ధనికొండ నాగేశ్వరరెడ్డి, నాయకులు చిక్కేపల్లి ప్రసాదరెడ్డి, అక్బర్‌బాషా, సుధాకర్‌రెడ్డి, గోపిరెడ్డి నాగేశ్వరరెడ్డి, షరీఫ్ తదితరులు నంద్యాలకు వెళ్లారు.

బేతంచెర్ల: మండలం నుంచి ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్రుడు, అధికార ప్రతినిధి మురళీకృష్ణ, ఉర్దూ అకాడమీ, స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్లు ముర్తుజావలి, ఖాజా, నాయకులు వెంకిరెడ్డి, ధరణి కుమార్, తిరుమలేశ్వర్‌రెడ్డి, జాకీర్, మురళీధర్‌రెడ్డి, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు.



బేతంచెర్ల నుంచి..



కోవెలకుంట్ల నుంచి..

సారా విక్రేతల అరెస్ట్



స్వాధీనం చేసుకున్న సారాను చూపుతున్న ఎక్సైజ్ సిబ్బంది

డోన్ టౌన్: ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్‌శాఖ పోలీసులు సోమవారం డోన్‌తో పాటు పాటు ప్యాపిలి మండలం అలేబాద్ తండాలో దాడులు నిర్వహించారు. పట్టణంలోని తారకరామనగర్‌కు చెందిన ఈడిగ లక్ష్మీని అదుపులోకి తీసుకుని ఆమె వద్ద నుంచి 15 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నారు. అలాగే అలేబాద్‌తండాకు చెందిన ముడావత్ శంకర్ నాయక్‌కు చెందిన 2 వేల లీటర్ల బెల్లం ఊట, 20 లీటర్ల సారాను ధ్వంసం చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ జయరాముడు తెలిపారు. వీరిద్దరిపై కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో ఎస్‌ఐలు సోమశేఖర్‌రావు, దౌలత్‌ఖాన్, రమేష్‌బాబు, హెడ్ కానిస్టేబుల్ నాగరాజు ,కానిస్టేబుల్స్ ఉమకాంత్‌రెడ్డి, బషీర్, గోపాల్ సింగ్, రంగస్వామి పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో జూన్ 26న అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేకదినోత్సవంపైవిద్యార్థులకుఅవగాహనకల్పించారు.

సేవతోనే జీవితానికి సార్థకత

బేతంచెర్ల: సమాజ సేవతోనే జీవితానికి సార్థకత ఉంటుందని, యువత సేవలో పాలు పంచుకోవాలని శేషారెడ్డి సీహెచ్‌సీ సూపరింటెండెంట్ సాగరిక అన్నారు. సోమవారం పట్టణంలోని శేషారెడ్డి సీహెచ్‌సీలో రోగులు, గర్భిణులు, వృద్ధులకు పట్నం మల్లమ్మ జ్ఞాపకార్థం కొడుకు నాగరాజు సహకారంతో లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మధుసూదన్‌రెడ్డి, రాజు అన్నదానం చేశారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

డోన్/డోన్ టౌన్: మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేసే టెక్నికల్, నాన్ టెక్నికల్ సిబ్బందికి కనీస వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు, మున్సిపల్ కౌన్సిలర్ సుంకయ్య, ఏఐటీయూసీ పురపాలక సంఘం అధ్యక్షుడు అబ్బాస్, ప్రభాకర్ డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం 8వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. ఇంజినీరింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు అధికారులు, పాలకుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడం సరికాదన్నారు. టెక్నికల్ ఉద్యోగులకు రూ.29,200, నాన్ టెక్నికల్ ఉద్యోగులకు రూ.24,500 వేతనం చెల్లించాలన్నారు. అలాగే 15 ఏళ్ల సర్వీస్ పూర్తయిన వారిని క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. విధి నిర్వాహణలో చనిపోయిన వారికి రూ.10 లక్షలు, అంగవైకల్యం పొందిన వారికి రూ.5 లక్షలు నష్టపరిహారంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. ఇంజినీరింగ్ వర్కర్లకు సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని కోరారు. కార్మిక సంఘం నాయకులు గౌస్, చంద్ర, అజయ్, రంగస్వామి, సంజీవ, ఇంతియాజ్, ఇస్మాయిల్, సురేష్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



రిలే నిరాహార దీక్ష చేస్తున్న ఇంజినీరింగ్ విభాగం ఉద్యోగులు

సచివాలయ ఉద్యోగుల నిరసన

డోన్: రాష్ట్ర ప్రభుత్వం వలంటీర్లు, గ్రామ సచివాలయ ఉద్యోగులపై వ్యవహరిస్తున్న తీరు ఏరు దాటక ముందు ఓడ మల్లన్న, ఏరు దాటిన తర్వాత బోడి మల్లన్న అనే చందంగా ఉందని గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా అధ్యక్షుడు సురేంద్ర, జిల్లా కోశాధికారి నవీన్, ఉపాధ్యక్షురాలు భారతి అన్నారు. సచివాలయాల ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు డోన్ మున్సిపల్ కార్యాలయం ఎదుట సచివాలయాల ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు సురేంద్ర మాట్లాడుతూ.. ఉద్యోగుల బదిలీ విషయంలో జీఓ నంబర్ 5 ప్రకారం సొంత మండలం, సొంత మున్సిపాలిటీలో పోస్టింగ్ ఇవ్వరాదని నిబంధన పెట్టడం దారుణమన్నారు. చాలీచాలని వేతనాలతో దూర ప్రాంతాలకు వెళ్లి ఉద్యోగులు విధులను సమర్థవంతంగా ఎలా నిర్వర్తించగలుగుతారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జీఓను సవరించాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు శ్రీనివాసులు, జగదీష్, తరుణ్, అక్బర్, క్రిష్ణానాయక్, గోవిందనాయక్ తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయ వద్ద నిరసన తెలుపుతున్న సచివాలయ ఉద్యోగులు